సాక్షి
వరంగల్
శుక్రవారం | 9 | మే | 2025



రోస్టర్ పద్ధతిలో పుష్కర విధులు

సరస్వతి పుష్కరాల విధుల నిర్వహణకు డ్యూటీ రోస్టర్ తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. - 10లో▸



ఎత్తుకు పై ఎత్తు వేద్దామా..

చదరంగంలో శిక్షణ అందిస్తూ ఎత్తుకు పై ఎత్తులు వేయడమెలా.. అంటూ మెదడుకు పదునుపెట్టిస్తున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
37^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోతతోపాటు వడగాలులు వీస్తాయి. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం సీతారాముల కల్యాణం



నల్లబెల్లి: అధ్యయనోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పురోహితుడు తిరునగరి సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో ఆలయ శాశ్వత ధర్మకర్త కొండ కృష్ణస్వామి దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం–కోమల దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నాగెల్లి శ్రీనివాస్, నీల శ్రీనివాస్, గోనెల నరహరి, మార్త మార్కండేయ, నాగెల్లి మొగిలి, సామల దేవేందర్, కోటగిరి నారాయణ, దంపతులు, హనుమాన్ స్వాములు, పప్పు మొగిలి, జక్కుల స్వామి, పెరుమాండ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

9 గంటల్లోపు వాకింగ్ చేయాలి : డీవైఎస్ఓ

వరంగల్: ఓసిటీ స్టేడియంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎవరికి అనుమతి లేదని డీవైఎస్ఓ సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాకింగ్, క్రీడలను ఉదయం 9 గంటల్లోపు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. కొంతమంది మైదానంలోకి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సమయంలో బయటకు పంపించొద్దని కోరారు. స్టేడియం సమయాన్ని దృష్టిలో ఉంచుకొని వాకర్స్ వాకింగ్ చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అలాగే, రాత్రి 8 గంటల తర్వాత వచ్చే ఆకతాయిలపై పోలీసుశాఖ సహకారంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలోపే మైదానాన్ని వ్యాయామం కోసం ఉపయోగించాలని చెప్పారు.

వర్ధన్నపేటలో బీఆర్‌ఎస్ నేతల ర్యాలీ



వర్ధన్నపేట: భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంతో వర్ధన్నపేటలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టిందని తెలిపారు. దీంతో భారత్ సత్తా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన జవాన్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, నాయకులు సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



నర్సంపేట/నెక్కొండ: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని రాష్ట్ర వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఉపసంచాలకులు డాక్టర్ విజయ ప్రవీణ్, జిల్లా పశువైద్యాధికారి బాలకృష్ణ, యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగమణి సూచించారు. ఈ మేరకు చెన్నారావుపేట మండల కేంద్రంలోని పశువైద్యశాల, నెక్కొండ పశువైద్యశాల పరిధిలోని రెడ్లవాడ ఉప పశువైద్యశాలలో గురువారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పశువులకు సంవత్సరానికి రెండుసార్లు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు శీతలీకరణ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమాల్లో పశువైద్యాధికారులు, మమత, మంజీలాల్, పశువైద్య సిబ్బంది యాకూబ్, గోపాలమిత్రలు రాజు, రమేశ్, ఆఫీస్ సబార్డినేట్లు కుమారస్వామి, కాంతమ్మ, జ్యోత్స్న, రైతులు హనుమ, కట్టారెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్లయ్య, సదయ్య, బుచ్చయ్య, వెంకన్న, రామచంద్రం, సుధాకర్, సాయిలు, వీరస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అన్నదాత

- వరిసాగు చేసిన రైతులకు తప్పని కష్టాలు
- అకాల వర్షాలతో తడిసిముద్దవుతున్న ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో తాలు, మట్టి, రాళ్ల పేరుతో కోత
- చివరికి ఎకరాకు రూ.20 వేలు కూడా మిగలని పరిస్థితి



అకాల వర్షాలతో ముత్తోజిపేట హైవేలో ఆరబెట్టిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

నర్సంపేట: నేల తల్లిని నమ్ముకున్న రైతుకు విత్తనం వేసిన నాటి నుంచి పంట అమ్ముకునే వరకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా వరి పంట సాగుచేసిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా వరి పంట సాగవుతోంది. ఖానాపురం మండలంలోని పాకాల సరస్సుతోపాటు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరు రావడంతో రైతులు యాసంగిలో 1,82,931 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. 2,14,513 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి 119 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నాటు వేసినప్పటి నుంచి కష్టాలే..

రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని వరి పంటలు సాగుచేశారు. ఈ క్రమంలో సమయానికి ట్రాక్టర్లు రాకపోవడం, వరి నాటుకు కూలీలు దొరకడంతో ఇబ్బంది పడ్డారు. సాధారణంగా రూ.350 ఉన్న కూలి.. నాట్లు ముమ్మరం అయ్యే సమయంలో రూ.500కు చేరుకుంది. తప్పనిపరిస్థితుల్లో రైతులు ఎక్కువ కూలి చెల్లించి కూలీలతో నాట్లు వేయించారు.

రసాయన ఎరువులకు..

నాటు వేసిన 15 రోజుల్లో పైపాటు మందులతోపాటు రసాయనిక ఎరువులు చల్లాల్సిన అవసరం ఉంటుంది. ఇందుకోసం అదనంగా పెట్టుబడి పెట్టినా ఆశించిన స్థాయిలో గొలుసులు రాకపోవడంతో ధాన్యం దిగుబడి తగ్గి రైతులకు నష్టాలే మిగిలాయి.

చివరి తడులందక...

యాసంగి సీజన్‌లో చివరి రెండు తడులు అందక చాలా వరకు దిగుబడి తగ్గింది. ఈ ప్రభావం జిల్లాలోని 30 శాతం మంది రైతులపై పడింది.

అకాల వర్షాలు..

అకాల వర్షాలు కురుస్తుండడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. దీంతో రైతులు తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షణ..

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లిన రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. తేమ రావడం లేదని నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. తాలు, మట్టి, రాళ్ల పేరుతో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల కోత పెడుతున్నారు. అలాగే, గన్నీ సంచుల కొరతతోపాటు కాంటాల ఆలస్యం అవుతోంది. ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే నిబంధనల పేరుతో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. ట్రాక్టర్ లోడ్‌కు రెండుమూడు క్వింటాళ్ల వరకు తరుగు తీస్తున్నారు. ఇలా ప్రతిచోట రైతు మోసపోతూనే ఉన్నాడు.

రూ.20వేలు కూడా మిగలడం లేదు..

నాటు వేసిన నాటి నుంచి ధాన్యం అమ్ముకునే వరకు ఎన్నో కష్టాలు పడుతున్న రైతుకు చివరికి తన కష్టం పోను ఎకరాకు రూ.20వేలు కూడా మిగలడం లేదు. భూమి విడిచి పెట్టలేక పంట పండిస్తున్నామే తప్ప లాభాలు వస్తాయని పంట పండించడం లేదని రైతులు వాపోతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు వేముల సంపత్‌రెడ్డి. నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామానికి ఇతడికి నాలుగు ఎకరాలు భూమి ఉంది. మూడు ఎకరాల్లో యాసంగి వరి పంట సాగు చేశాడు. పంటను క్రిమికీటకాల నుంచి కాపాడుకునేందుకు 12 సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశాడు. దీంతో ఎకరాకు రూ.35వేల చొప్పున 1.5 లక్షల పెట్టుబడి అయ్యింది. అకాల వర్షాలతో పంట నేలవాలింది. ఇప్పటివరకు వరి పంట కోయలేదు. ఈ పరిస్థితి సంపత్‌రెడ్డి ఒక్కడిదే కాదు.. ధాన్యాగార కేంద్రంగా పేరొందిన జిల్లాలో వరి పంట సాగు చేసిన రైతులందరూ ఈ సమస్యే ఎదుర్కొంటున్నారు.

రెండుసార్లు ధాన్యం తడిసింది..



12 ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. అకాల వర్షాలకు రెండు సార్లు ధాన్యం తడిసింది. దీంతో 30 క్వింటాళ్ల వరకు నష్టపోయాను. ఇప్పటి వరకు 180 క్వింటాళ్ల ధాన్యం అమ్మిన. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ధాన్యం అమ్ముకునే సమయంలోనే అకాల వర్షాలు అన్నదాతలకు నష్టాన్ని కలిగిస్తున్నాయి.

- కరివేదల వెంకట్‌రెడ్డి, వేదనగర్, నల్లబెల్లి మండలం

రూ 1.10 లక్షల పెట్టుబడి పెట్టిన..



ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. ఇందుకోసం రూ.1.10 లక్షల పెట్టుబడిన పెట్టిన. రాజుపేట హైవేపై 60 క్వింటాళ్ల ధాన్యం ఆరబెట్టిన. ఇప్పటికే మూడు సార్లు కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. బుధవారం రాత్రి కూడా చిరు జల్లులు కురవడంతో కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడ్డాం. పొద్దంతా ఎండలు, రాత్రి పూట వర్షాలు వస్తుండడంతో ధాన్యం ఆరబెట్టేందుకు కష్టాలు తప్పడం లేదు.

- గొల్లపల్లి సురేశ్, రాజుపేట,నర్సంపేట మండలం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- సీపీ సన్‌ప్రీత్ సింగ్

సాక్షి ఎఫెక్ట్..



సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు ఇబ్బంది పడేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్.. మందుబాబులను హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలోని మద్యం దుకాణాల ముందు, రోడ్లపై మద్యం సేవిస్తుండటంతో వచ్చిపోయే ప్రజలు, చిన్నపిల్లలు ఇబ్బందులకు గురవుతున్న వైనంపై ఈ నెల 4వ తేదీన సాక్షిలో ప్రత్యేక విజిట్ కథనం ప్రచురితమైంది. దీంతోపాటు పోలీసులకు పలు ఫిర్యాదులు రావడంతో సీపీ స్పందించారు. బహిరంగ మద్యపానంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పగలు, రాత్రి సమయాల్లో మద్యం దుకాణం పరిసరాలతోపాటు నిర్మానుష్య ప్రదేశాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. దీంతోపాటు నిర్మాణంలో ఉన్న భవనాలు, మనుషులు నివాసం లేని పురాతన భవనాల్లో తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. దీనిలో భాగంగానే బుధవారం రాత్రి కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 221 మంది మందుబాబులను అదుపులోకి తీసుకొని వారిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా జనగామ డివిజన్ పరిధిలో 57 కేసులు నమోదు కాగా, హనుమకొండ డివిజన్ పరిధిలో 42 , ఘన్‌పూర్ 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్ 10 కేసులు నమోదైనట్లు వివరించారు. మద్యం దుకాణాల పరిసరాల్లో ఎవరూ బహిరంగంగా మద్యం సేవించకుండా దుకాణ యజమానులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

శ్రీభద్రకాళి అమ్మవారికి వసంతోత్సవం



అభిషేకం చేస్తున్న అర్చకుడు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి చతురస్త సేవ, సాయంత్రం విమానకసేవ (సర్వభూపాల వాహనసేవ) నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు రాష్ట్ర కుమ్మరి కుల సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆమంచి నాగపరిమళ, శ్రీనివాస్ రావు దంపతులు, ఆమంచి రాజ్‌ప్రదీప్, అనసూయ, అనిల్ కార్తీక్, రాజేశ్వరి, ధర్మరాజు, వందన, అవునూరి రాంమూర్తి ప్రజాపతి, కుమారస్వామి, నాంపల్లి ప్రభాకర్, శ్రీనివాస్, రమేశ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

జూపార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

న్యూశాయంపేట : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జూపార్కులో కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్డు, సీసీ డ్రెయిన్ పనులకు గురువారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు సందర్శనకోసం వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

- 14 నుంచి సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల్లోని 2,4,6 సెమిస్టర్ల, బ్యాక్‌లాగ్ మొదటి, మూడవ, ఐదో సెమిస్టర్ల పరీక్షల టైంటేబుల్‌ను గురువారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సెమిస్టర్ల వారీగా ఇలా..

- రెండో సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 14, 16, 19, 21, 23, 26, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి.
- నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు.
- ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4, 10, 11, 12, 13, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయి.
- 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30. జూన్ 3, 5, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు.
- మొదటి సెమిస్టర్ పరీక్షలు జూన్ 17,18, 20, 21, 23, 24, 25వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటలవరకు జరుగుతాయి.
- మూడో సెమిస్టర్ పరీక్షలు జూన్ 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి.

రాష్ట్రస్థాయి ఉత్తమ బ్యాంకు మేనేజర్‌గా అనిల్



సంగెం : అవార్డు అందుకుంటున్న యాకర అనిల్

సంగెం: రాష్ట్రస్థాయి ఉత్తమ బ్యాంకు మేనేజర్‌గా సంగెం యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర అనిల్ అవార్డు అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు భారీగా రుణాలు అందజేసి, మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసినందుకు అనిల్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోలోని జ్యోతిరావుఫూలే ప్రజాభవన్ (ప్రగతి భవన్)లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ చేతుల మీదుగా గురువారం ఆయన అవార్డు అందుకున్నారు. సందర్భంగా అనిల్‌ను మండల అధికారులు, మహిళలు, ప్రజలు అభినందించారు.

డీఆర్‌డీఓకు అవార్డు ప్రదానం

వరంగల్: స్వయం సహాయ సంఘాలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రుణాలు ఇప్పించడంలో ప్రతిభ కనబర్చినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ చేతుల మీదుగా డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అందుకున్నారు. అవార్డు వచ్చేందుకు కృషిచేసిన ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు, ఇతర సిబ్బందికి అభినందనలు ఆమె తెలిపారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదు

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఫైర్

హన్మకొండ: సీఎం రేవంత్ రెడ్డికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. గురువారం రాత్రి హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన 13 డివిజన్‌ల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంటనే దాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో చేపట్టకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పటి నుంచి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ నాయకులు ఎల్లావుల లలితా యాదవ్, బుద్దె వెంకన్న, చింతల యాదగిరి, బండి రజనీ కుమార్, రాజు నాయక్, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పోస్టుమార్టం అంతా గోప్యం!

- ఎంజీఎం మార్చురీ వద్ద కమాండర్ల పేర్లు వెల్లడించని అధికారులు
- డీజీపీ వచ్చాక సాయంత్రం అధికారిక ప్రకటన విడుదల
- ప్రత్యేక బందోబస్తుతో హెడ్‌క్వార్టర్స్‌కు మృతదేహాల తరలింపు



మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో దిగుతున్న హెలికాప్టర్



కమాండర్ల మృతదేహాలను అంబులెన్స్‌లో హెడ్‌క్వార్టర్స్‌కు తరలిస్తున్న పోలీసులు



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ వద్ద మృతదేహాల తరలింపు

ఎంజీఎం/మామునూరు: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పేరూరు–లంకపల్లి అడవుల్లో గురువారం తెల్లవారు జామున జరిగిన పరస్పర కాల్పుల్లో ముగ్గురు గ్రేహౌండ్ కమాండర్లు మందుపాతర పేలి చనిపోయారని పోలీసులు ప్రకటించారు. వారి మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో గురువారం మధ్యాహ్నం వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు తీసుకువచ్చారు. అక్కడినుంచి మామునూరు ఏసీపీ తిరుపతి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నడుమ ప్రత్యేక అంబులెన్స్‌లో ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏసీపీ స్థాయి అధికారులు, ముగ్గురు తహసీల్దార్లు, గ్రేహౌండ్స్ అధికారులు నాలుగు గంటల పాటు రహస్యంగా పోస్టుమార్టం చేయించారు. కనీసం మార్చురీ వద్ద మృతి చెందిన పోలీసుల పేర్లు వెల్లడించలేదు. సాయంత్రం 6 గంటలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. ఆ తర్వాత డీజీపీ జితేందర్, ఏడీజీ గ్రే హౌండ్స్ స్టీఫెన్ రవీంద్ర ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. నక్సలైట్ల దాడిలో గ్రేహౌండ్స్‌కు చెందిన కమాండర్లు వడ్ల శ్రీధర్, ఎస్.పవన్ కళ్యాణ్, టి.సందీప్ చనిపోయినట్లు సాయంత్రం మీడియాకు అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతరం మృతదేహాలను చాపల్లో చుట్టి ప్రత్యేక బందోబస్తు నడుమ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు. అక్కడ కమాండర్ల మృతదేహాలకు రాష్ట్రమంత్రి ధనసరి సీతక్క, డీజీపీ జితేందర్, ఏడీజీ గ్రే హౌండ్స్ స్టీఫెన్ రవీంద్ర, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, సీపీ సన్ ప్రీత్ సింగ్, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ నివాళులర్పించారు. కాగా, ముగ్గురు జవాన్లలో ఇద్దరు హైదరాబాద్, మరొకరు కామారెడ్డికి ప్రాంతానికి చెందిన వారు.

బుల్లెట్ గాయాలతోనే మృతి..

బుల్లెట్ గాయాలతోనే జవాన్లు మృతిచెందినట్లు పోస్టుమార్టం ద్వారా స్పష్టంగా వెల్లడైంది. ల్యాండ్ మైన్ పేలడంతోనే జవాన్లు చనిపోయి ఉంటే మృతదేహాలు చెల్లాచెదురయ్యేవి. కాగా, ముగ్గురు జవాన్లకు ఐదు బుల్లెట్లు దిగినట్లు తెలుస్తోంది. మెడ, పక్కటెముకలు, కడుపులోకి బుల్లెట్లు వెళ్లడంతో వారు మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనలో మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. పైడిపల్లికి చెందిన ఆర్ఎస్సై రణధీర్‌ను అత్యవసర వైద్యసేవల కోసం హైదరాబాద్ ఏఐజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మార్చురీ వద్ద కనిపించని కుటుంబ సభ్యులు..

సాధారణంగా మార్చురీ వద్ద మృతదేహాలకు పోస్టుమార్టం చేస్తుండగా వారి కుటుంబ సభ్యులు ఉంటారు. కానీ, పోలీస్ సిబ్బంది, గ్రేహౌండ్స్ ఉన్నతాధికారులు ముగ్గురు జవాన్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను పోస్టుమార్టం వద్దకు రానివ్వకుండా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు.

నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ డాక్టర్ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌ను డీజీపీకి అటాచ్ చేశారు.

పెద్దమ్మగుడిలో గంటల చోరీ

రాయపర్తి: కొత్తూరు గ్రామంలోని పెద్దమ్మ గుడి, ఎల్లమ్మ గుడిలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. సుమారు రూ.10 వేల విలువ చేసే గుడిగంటలను దొంగిలించారు. వారం రోజుల క్రితం గ్రామంలో పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి గుడి పండుగ చేశామని, ఇంతలోనే దొంగలు గంటలు ఎత్తుకెళ్లారని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు భీమని యాదగిరి, భీమని శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



గైకోని రమ (ఫైల్)

దుగ్గొండి: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్వామిరావుపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గైకోని రాములుకు ఇద్దరు కుమారులు రవి, చిరంజీవి ఉన్నారు. వీరికి 4.20 ఎకరాల భూమి ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం రాములు తన ఇద్దరు కుమారులకు రెండు ఎకరాల చొప్పున భూమి ఇచ్చాడు. 20 గుంటల భూమి తన వద్ద ఉంచుకున్నాడు. పెద్ద కుమారుడు రవి వరంగల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేసి కట్నం కింద రవి చెరో ఎకరం రాసిచ్చాడు. ఈ భూమి తండ్రి రాములు పేరున ఉంది. తన కుమార్తెల పేరున భూమి రిజిస్ట్రేషన్ చేయాలని రవి తండ్రిని కోరాడు. ఆయన అంగీకరించకపోవడంతో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో బుధవారం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. రవి భార్య రమ (47) మనస్తాపంతో అదేరోజు రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో దూకి చనిపోయింది. తన భార్య చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రవి గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

శిల్పాల ప్రాంగణంలో ఏర్పాట్ల పరిశీలన

ఖిలా వరంగల్: ప్రపంచ సుందరీమణులు ఈనెల 14న ఖిలావరంగల్ కోటకు రానున్న నేపథ్యంలో గురువారం శిల్పాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి టూరిజం జీఎం నాథన్ పరిశీలించారు. సౌండ్ అండ్ లైటింగ్ షోకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. కోట వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలను బల్దియా సిబ్బంది తొలగించారు. ఫ్లడ్‌లైట్ల నిర్వహణను పరిశీలించారు. కోటను సందర్శించిన వారిలో నోడల్ ఆఫీసర్ పుష్పలత రెడ్డి, వివిధ శాఖల అధికారులు శివాజీ, బండి నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్, కుసుమ సూర్యకిరణ్, విజయ్, శ్రీకాంత్, అజయ్, కోట గైడ్ రవియాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోగో డిజైన్ కమిటీ సభ్యుడిగా నారాయణ


ప్రొఫెసర్ ఈసం నారాయణకు ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ములుగు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లోగోను రూపొందించేందుకు ఆ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ లోగో డిజైన్ కమిటీలో ముగ్గురు సభ్యులను నియమించారు. ఆకమిటీలో కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణను సభ్యుడిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఉత్తర్వులు యూనివర్సిటీకి పంపగా.. వీసీ ప్రతాప్‌రెడ్డి ఈసం నారాయణకు అందించి అభినందించారు. లోగో డిజైన్ కమిటీ చైర్మన్‌గా ట్రైబల్ యూనివర్సిటీ వీసీ వైఎల్ శ్రీనివాస్ వ్యవహరించనున్నారు. మరో ఇద్దరు సభ్యులుగా ఇతర యూనివర్సిటీలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ కేసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు ఉన్నారు.

ఓరుగల్లు పీఠం పాలనాధికారిగా విజయపాల్‌రెడ్డి


విజయపాల్‌రెడ్డి

కాజీపేట రూరల్: ఓరుగల్లు మేత్రాసనం క్యాథలిక్ పీఠం పాలనాధికారి (అడ్మినిస్ట్రేటర్)గా పి. విజయపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన విజయపాల్‌రెడ్డి 1992లో క్యాథలిక్ గురువుగా పదోన్నతి పొందారు. తర్వాత ఫాతిమా బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఫాతిమా లోడి సంస్థ డైరెక్టర్‌గా సేవలందించి ఇక్కడి నుంచి జనగామ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఓరుగల్లు పీఠాధిపతిగా ఉన్న బిషప్ ఉడుమలబాల ఇటీవల పదోన్నతిపై విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా వెళ్లడంతో అప్పటి నుంచి ఓరుగల్లు క్యాథలిక్ పీఠానికి బిషప్ లేరు. కొత్త బిషప్ ఎంపిక ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఓరుగల్లు క్యాథలిక్ డయాసిస్ కౌన్సిల్ వారు విజయపాల్‌రెడ్డిని పాలనాధికారిగా ఎన్నుకున్నట్లు గురువారం వారు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మామునూరు: ఆర్థిక ఇబ్బందులతో మామునూరుకు చెందిన గూడెం రాజ్‌కుమార్(24) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోదరి వివాహానికి మొత్తం ఖర్చు తానే భరిస్తానని తల్లికి మాట ఇచ్చాడు. పెళ్లి తేదీ సమీపిస్తుండడంతో డబ్బులు సర్దుబాటు కాలేదని మనస్తాపం చెంది రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.



ఎత్తుకు పైఎత్తు వేద్దామా..

వేసవిలో చెస్ శిక్షణ తరగతులు

- చిన్నారుల మేధస్సుకు పదును
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు




చదరంగంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

వరంగల్ స్పోర్ట్స్: కాస్త సమయం దొరికిందంటే చాలు సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేసే పిల్లలే ఎక్కువ.. ప్రస్తుతం వేసవి సెలవులు తల్లిదండ్రుల్లో మరింత ఆందోళన పెంచుతున్నాయి. సెలవుల్లో పిల్లలను ఫోన్‌కు ఎలా దూరంగా ఉంచాలో తెలియక కొందరు తల్లిదండ్రులు తికమక పడుతుండగా.. పిల్లలను ఖాళీగా ఉంచకుండా వారి మేధస్సుకు పదునుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు మరికొందరు అమ్మానాన్నలు.

చదరంగంలో శిక్షణ అందిస్తూ ఎత్తుకు పైఎత్తులు వేయడమెలా? అంటూ మెదడుకు పదునుపెట్టిస్తున్నారు. దీంతో పిల్లలు సైతం మరో ఆలోచనలోకి వెళ్లకుండా శ్రద్ధగా చదరంగంలో శిక్షణ పొందుతున్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ స్కూల్‌లో కన్నా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదరంగ వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు చెస్ బోర్డుపై పావులు కదుపుతూ బిజీగా మారిపోయారు. ఈక్రమంలో చదరంగం ఆట తీరు, ఎలా ఆడతారు? చెస్‌బోర్డు విశేషాలు, శిక్షణ పొందుతున్న చిన్నారుల అభిప్రాయాలతో 'సాక్షి' కథనం.

మొత్తం 64 గళ్లు

17సెంటీమీటర్ల పొడవు, 18 సెంటీమీటర్ల వెడల్పుతో 32 తెలుపు, 32 నలుపు గళ్లతో ఆకర్షణీయంగా ఉండే చదరంగ బోర్డు మనిషిలోని మేధస్సును తట్టి లేపుతుందనడంలో అతిశయోక్తి లేదు. చదరంగంలో ఆరితేరారంటే జీవితంలోని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యం పొందొచ్చని చెప్పొచ్చు. మానవమేధస్సుకు పదునుపెట్టే ఈ చదరంగం పుట్టినిల్లు భారతదేశం కావడం విశేషం. భారత్‌లో పుట్టిన చదరంగం ప్రస్తుతం విశ్వక్రీడగా విరాజిల్లుతోంది.

మూడు విభాగాల్లో..

- టోర్నమెంట్లలో 3 నిమిషాల్లోపు ఆడే ఆటను బుల్లెట్‌గా, 5 నిమిషాల్లోపు ముగించే ఆటను బ్లిడ్జ్‌గా, 10 నుంచి 15 నిమిషాలకు పైగా ఉండే ఆటను ర్యాపిడ్ విభాగంగా, 25 నిమిషాలు, ఆపై ఆడే ఆటను క్లాసికల్ గేమ్‌గా పిలుస్తారు.

ఆట ఇలా...

చెస్ అనగానే మనందరికీ తెలిసింది.. సైనికులు, ఏనుగు, ఒంటె, గుర్రం, రాజు, మంత్రి వీటిలో ఒక్కో పావుకు విభిన్న కదలికల రూపం ఉంటుంది. ఇందులో రెండు రుక్ (ఏనుగు)లు, రెండు నైట్ (గుర్రం)లు, రెండు బిషప్ (ఒంటె)లు, ఒక కింగ్ (రాజు), ఒక క్వీన్(మంత్రి), 8 మంది పాన్ (సైనికులు)లు ఉంటారు. పాన్‌లను ముందుకు కదుపుతూ.. అత్యవసర సమయంలో మిగిలిన పావులను కదుపుతూ ప్రత్యర్థిని కట్టడి చేస్తూ ఆడాల్సి ఉంటుంది.

సంతోషంగా ఉంది..



పదిహేను రోజులుగా చెస్ నేర్చుకుంటున్నా. మొదటి రోజు ఏనుగు, గుర్రం, ఒంటె, సైనికులు అంటూ సార్ చెబుతుంటే ఏం అర్థం కాలేదు. నాలుగైదు రోజుల తర్వాత నుంచి కొద్దిగా ఆడడం వస్తోంది. ఇప్పుడు ఆడుతుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది. ప్రతి రోజు మూడు గంటల శిక్షణ, ఆ తర్వాత ఇంటికెళ్లాక ప్రాక్టీస్ చేస్తున్నా.

– శాన్విక , రెండో తరగతి, శ్రీనివాసకాలనీ

మూడు గంటల శిక్షణ



వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ శిబిరానికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11గంటల వరకు శిక్షణ అందిస్తున్నాం. చెస్ అర్థం కావడానికి కొందరికి కాస్త సమయం ఎక్కువ పడుతుంది. సులువైన పద్ధతుల్లో చెస్ ఆడడం నేర్పిస్తున్నా.. ఏప్రిల్ 24న ప్రారంభమైన శిబిరం ఈనెల 24న ముగియనుంది. వేసవి శిబిరం అనంతరం కూడా మా అకాడమీలో తరగతులు నిరంతరం కొనసాగుతుంటాయి. ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇస్తున్నాం. వివరాలకు 90595 22986 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

– కన్నా, అకాడమీ నిర్వాహకుడు

టైం సరిపోవట్లేదు..



వారం రోజులు చెస్‌పై అసలు పట్టు దొరకలేదు. అప్పుడు చెస్ అంటేనే భయమేసేది. ఇప్పుడు ఆడుతుంటే అసలు టైమే సరిపోవడం లేదు. ఒకటి రెండు ఆటలు ఆడడానికే రెండు మూడు గంటల సమయం పడుతోంది. సార్ కొత్త టెక్నిక్స్‌తో ఎలా ఆడాలో చెబుతున్నారు. రోజుకో టెక్నిక్‌తో చెస్‌పై మరింత శ్రద్ధ పెరిగింది.

– అక్షిత, రాంనగర్


జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం సమ్మర్ క్యాంపులో భాగంగా వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు – బచ్చన్నపేట

నేటి నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- ఉమ్మడి జిల్లాలో ఆరు సెంటర్లు
- క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాలో ఆరు వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి (శుక్రవారం) నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక పాలకవర్గ సమావేశంలో తీసుకున్న తీర్మానాన్ని హెచ్‌సీఏ ఆమోదించినట్లు తెలిపారు. గ్రామీణ జిల్లాలో క్రికెట్ అభివృద్ధే ధ్యేయంగా అన్ని క్రికెట్ సెంటర్లలో ఉదయం, సాయంత్రం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్–14, 16, 19, 23 బాలబాలికల విభాగాల్లో శిక్షణ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు శిబిరాల్ని వినియోగించుకోవాలని సూచించారు.

క్యాంపుల వివరాలు:		
కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండ్:	కోచ్ తోట రాము	99665 59414
మహబూబాబాద్, కాంక్రీట్ గ్రౌండ్	అజయసారథి	98664 79666
భూపాలపల్లి, సింగరేణి స్టేడియం	శ్రీనివాస్	88978 05683
పరకాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ	అభినవ్‌వినయ్	96662 06662
ములుగు, తంగేడు గ్రౌండ్	సందీప్‌నేత్ర	90301 30727
జనగామ, సెజ్ పాఠశాల గ్రౌండ్	దిలీప్‌రెడ్డి	99590 00003

వడదెబ్బతో ఇద్దరు మృతి

ఎండ తీవ్రత పెరిగిన కారణంగా వడదెబ్బ బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఆదివారం వడదెబ్బ కారణంగా ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు.


శ్రీనివాస్(ఫైల్)

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కాంటా వేస్తున్న హమాలీ కార్మికుడు శివరాత్రి శ్రీనివాస్ (35) వడదెబ్బతో మృతి చెందాడు. వర్ధన్నపేట మండలం సాగరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ వరంగల్‌లోని సుందరయ్యనగర్‌లో నివాసం ఉంటూ.. మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. గురువారం శ్రీనివాస్ యథావిధిగా పసుపు యార్డులోని గజేంద్ర అడ్తికి వచ్చిన మిర్చి బస్తాలను తూకం వేస్తున్న క్రమంలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి కార్మికులు ప్రథమ చికిత్స చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మార్కెట్‌లోని అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆటోలో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లుగా కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శ్రీనివాస్ మృతిపై మార్కెట్ అధికారులు, కార్మికులు, వ్యాపారులు, సుందరయ్యనగర్ వాసులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో రైతు..


చిన్నరాజయ్య(ఫైల్)

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి కాసీంపల్లి గ్రామానికి చెందిన రైతు చిత్తారి చిన్న రాజయ్య (68) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. చిన్నరాజయ్య బుధవారం వరి ధాన్యం కోసేందుకు పనికి వెళ్లాడు. సాయంత్రం అస్వస్థకు గురవగా.. కుటుంబ సభ్యులు భూపాలపల్లిలోనిఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన గురువారం సాయంత్రం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కైలాస్‌యాదవ్


కైలాస్‌యాదవ్

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖిలా వరంగల్ మధ్యకోటకు చెందిన బైరబోయిన కైలాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఫిబ్రవరిలో హైదరాబాద్ నాంపల్లిలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు నిర్వహించగా, అంతర్జాతీయ క్రీడాపోటీలు కొనసాగుతున్న నేపథ్యంలో ఫలితాలను నిలిపివేశారు. కాగా, గురువారం తెలంగాణతోపాటు మరో 15 రాష్ట్రాల నూతన కమిటీ జాబితాను జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటర్ అలహాబాద్ రిటైర్డ్ జడ్జి ఫంకజ్ నఖ్వీ అధికారికంగా ప్రకటించారు. తెలంగాణ జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా డి.సంతోశ్, బి.సాయిరాం యాదవ్, టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సీహెచ్.రాము, టెక్నికల్ కమిటీ సెక్రటరీగా నాగరాజు ఎన్నికయ్యారు. వారంతా నాలుగేళ్లపాటు ఆయా పదవుల్లో కొనసాగనున్నారు.

ఇసుక లారీ వేగానికి ఓ ప్రాణం బలి

- మృతుడిది మంత్రి శ్రీధర్‌బాబు స్వగ్రామం


తుల్సెగారి రాజలింగు (ఫైల్)

కాటారం: ఇసుక లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తకు ఓ నిండు ప్రాణం బలైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడకు చెందిన రాజలింగు(58) కాటారం మండల కేంద్రంలో జరిగిన బంధువుల వివాహ వేడుకకు హాజరై ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఇసుక లారీ ఢీకొని మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్ష్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్వాడకు చెందిన తుల్సెగారి రాజలింగు బయ్యారం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బంధువుల వివాహానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. చింతకాని క్రాస్ సమీపంలోకి రాగానే భూపాలపల్లి వైపుగా వస్తున్న ఇసుక లారీ వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన బారికేడ్లను తప్పించబోయి రాంగ్‌రూట్‌లో వచ్చి రాజలింగు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో రాజలింగు కాలు ఎముకలు లారీ ముందు భాగంలో చిక్కుకొని తెగిపోవడంతోపాటు ఆయన రోడ్డుపై ఎగిరిపడ్డాడు. తలకు తీవ్రగాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై అభినవ్, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీయబోమని రాజలింగు కుటుంబ సభ్యులు, బంధువులు నిరసనకు దిగే ప్రయత్నం చేశారు. గంటపాటు ఎస్సై బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై గీతారాథోడ్ తెలిపారు.

ముగ్గురిపై పెంపుడు కుక్క దాడి

- చిన్నారికి తీవ్ర గాయాలు
- కాపాడబోయిన వారిపైనా..


కుక్క దాడిలో కిషన్, రక్మీ కాళ్లకు గాయాలు


చికిత్స పొందుతున్న చిన్నారి హర్షిత

మహబూబాబాద్ రూరల్: ఏడేళ్ల చిన్నారితో పాటు కాపాడబోయిన బాలిక బంధువులపై పెంపుడు కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మహబూబాబాద్ మండలం కేవులతండాలో గురువారం చోటుచేసుకుంది. కేవుల తండాకు చెందిన బాదావత్ బిక్యా తన ఇంట్లో ఒక కుక్కను పెంచుకుంటున్నాడు. అతడు ఆ కుక్కను ఇంట్లో కట్టేయకుండా వదిలేశాడు. ఇరుగు పొరుగువారు చెప్పినా వినలేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి బానోత్ శ్రీకాంత్, అరుణ దంపతుల ఏడేళ్ల కుమార్తె హర్షిత వీపుభాగంలో కుక్క దాడి చేసి గాయపర్చింది. తల్లిదండ్రులు స్థానికంగా వైద్యం అందించారు. ఉదయం చిన్నారి ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా మళ్లీ కరిచింది. గమనించిన తండావాసులు, బాలిక బంధువులు బాదావత్ కిషన్, రక్మీ దంపతులు కుక్కను తరిమేసి హర్షిత గాయాల్ని కడుగుతుండగా.. కుక్క మళ్లీ వచ్చి కిషన్, రక్మీ దంపతులను కరిచింది. తీవ్రగాయాలవడంతో స్థానికులు వారిని చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

పెంపుడు కుక్క యజమానిపై కేసు

పెంపుడు కుక్క దాడి చేసి ముగ్గురిని తీవ్రంగా గాయపర్చిన ఘటనలో కుక్కను పెంచుతున్న బాదావత్ బిక్యాపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వి.దీపిక గురువారం రాత్రి తెలిపారు.

విద్యార్థులకు వినూత్నంగా బోధించాలి

- టీచర్ల శిక్షణలోఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ రమేశ్

విద్యారణ్యపురి: విద్యాశాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా వినూత్నంగా విద్యను బోధించాలని తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) డైరెక్టర్ గాజర్ల రమేశ్ కోరారు. కాజీపేట ఫాతిమా నగర్‌లోని బాలవికాస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో గణితం, సోషల్ స్టడీస్ జిల్లా స్థాయి రిసోర్స్‌పర్సన్లకు మూడురోజులుగా శిక్షణ నిర్వహిస్తున్నారు. గురువారం ఆయన ఈశిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. డీఆర్‌పీలను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలతో ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డుల ద్వారా ఐసీటీని ఉపయోగిస్తూ బోధించడం వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎస్‌సీఈఆర్టీ కోర్సు కో–ఆర్డినేటర్లు ఎల్లయ్య, గణపతి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు రంగపాణిరెడ్డి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీ ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- సెట్ జిల్లా కో–ఆర్డినేటర్ ఇందుమతి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న టీజీఆర్‌జేసీ సెట్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆ సెట్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.ఇందుమతి గురువారం తెలిపారు. హనుమకొండలో 32 కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 7,564 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కాగా, కిషన్‌పురలో చైతన్య హైస్కూల్ పరీక్ష కేంద్రం అని హాల్‌టికెట్లు జారీ అయిన అభ్యర్థులకు హనుమకొండలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సెంటర్‌కు మార్చారని, గమనించాలని ఆమె కోరారు.

సరస్వతీ పుష్కరాలకు పటిష్ట భద్రత

- మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- కాళేశ్వరంలో ఎస్పీతో కలిసి ఏర్పాట్ల పరిశీలన


కాళేశ్వరం దేవస్థానంలో భద్రతా చర్యలను వివరిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ కిరణ్‌ఖరే, ఏఎస్పీ, డీఎస్పీలు

కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాలకు పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి పుష్కరాల పనుల్ని ఆయన పరిశీలించారు. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు జరిగే పుష్కరాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై కాళేశ్వరం దేవస్థానం, ఆలయ పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, హెలిపాడ్, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల క్యూ లైన్లు, పుష్కర ఘాట్ల వద్ద భద్రతా చర్యలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. సరస్వతీ పుష్కరాలకు పెద్ద ఎత్తున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారని, భక్తులకు ఇబ్బందులు కల్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.


కాళేశ్వరాలయంలో పూజలు

మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి కాళేశ్వరం దేవస్థానానికి రాగా.. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు ఇచ్చి సన్మానించారు. ఆయన వెంట ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, కాటారం, భూపాలపల్లి, డీఎస్పీలు రామ్మోహన్‌రెడ్డి, సంపత్ రావు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మహదేవపూర్ సీఐ రామచందర్‌రావు, కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రోస్టర్ పద్ధతిలో పుష్కర విధులు


- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- అధికారులతో టెలికాన్ఫరెన్స్


టెలి కాన్ఫరెన్స్‌లో సూచనలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: సరస్వతి పుష్కరాల విధుల నిర్వహణకు డ్యూటీ రోస్టర్ తయారు చేస్తున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం సరస్వతి పుష్కరాల విధులు, పనుల పర్యవేక్షణపై రెవెన్యూ, పంచాయతీరాజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుష్కరాలకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు ప్రొటోకాల్ విధులు, ఎంపీడీఓలు పారిశుద్ధ్య విధుల పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఘాట్ వద్ద రెండు రోజుల్లో మొత్తం పారిశుద్ధ్య పనులు పూర్తి చేసి పరిశుభ్రం చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చూసుకోవాలన్నారు. పుష్కర విధులు కేటాయించిన అధికారులు శుక్రవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సమయం తక్కువగా ఉందని పనులు, ఏర్పాట్లు ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సరస్వతీ మాత విగ్రహం ప్రారంభోత్సవం, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డులు, ఉచిత అన్నదానం.. ఇలా ప్రతీ అంశాన్ని పర్యవేక్షించేందుకు నియమించిన అధికారులు శుక్రవారం నుంచి పటిష్ట పర్యవేక్షణ చేయాలని, వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఆర్టీసీ విస్తృత సేవలు

- రద్దీ పెరిగితే 400 ట్రిప్పులు తిరిగేలా ప్రణాళికలు
- అన్ని రూట్లలో సర్వీసులు సిద్ధం: కరీంనగర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్


కాళేశ్వరంలో తాత్కాలిక బస్‌స్టేషన్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈడీ, తదితరులు

కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉంటాయని కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్ అన్నారు. గురువారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా తాత్కాలిక బస్‌స్టేషన్, ఘాట్లను సందర్శించారు. తాత్కాలిక బస్ స్టేషన్ వద్ద గ్రౌండ్ లెవలింగ్, విద్యుత్ పనులు, తాగునీరు, టాయిలెట్ల ఏర్పాట్లు సమీక్షించారు. హనుమకొండ – కాళేశ్వరం, మంచిర్యాల – కాళేశ్వరం, గోదావరిఖని – మంచిర్యాల – కాళేశ్వరం మార్గాల్లో స్పెషల్, రెగ్యులర్ సర్వీసులు నడిపేందుకు ప్లాన్ ఆపరేషన్‌పై చర్చించారు. ప్రస్తుతం హనుమకొండ, మంచిర్యాల, మంథని, గోదావరిఖని వంటి వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరం వరకు 67 ట్రిప్పులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా, వారి రవాణా సౌకర్యార్థం 400 బస్ ట్రిప్స్ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆయనతో ఆర్ఎం భాను, డీఎం ఇందు తదితరులు ఉన్నారు.